సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024




పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

ఆదర్శనీయం..

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్త్రీ అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిబాపూలే 198వ జయంతి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. అధికారులు, నాయకులు ఆయన చిత్ర పటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ పక్కన గల పూలె విగ్రహానికి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ నివాళులర్పించారు. ఆయన వెంట జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, నాయకులు ఉన్నారు.

– సంగారెడ్డి టౌన్

సంగారెడ్డి హాస్టల్ గడ్డ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ప్రార్థన చేస్తున్న చిన్నారులు

భక్తిభావం..

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండగను గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు ఈద్గాల వద్దకు వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. చిన్నాపెద్దలు పరస్పరం ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. వేడుకల నేపథ్యంలో ఎలాంటి ఆటంకాలు జరుగకుండా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ప్రముఖులు ఈద్గాల వద్ద విచ్చేసి ముస్లింలకు ఈద్ ముబారక్ తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని హాస్టల్ గడ్డ ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేశారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

న్యూస్‌రీల్

జేసీజే కోర్టు మంజూరు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

సంగారెడ్డి టౌన్ : జేసీజే కోర్టు మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఈనెల 19న న్యాయవాదుల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. గురువారం సంగారెడ్డి పోర్ట్ పోలియో జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన మాధవిని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాలో మరొక జేసీజే కోర్టు మంజూరు చేయాలని, న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ బెల్టుల ప్రదానం

జోగిపేట(అందోలు): ఆత్మరక్షణ విద్య నేటి సమాజంలో అమ్మాయిలకు ఎంతో ముఖ్యమని అందోల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సాయిలత అన్నారు. పీఎం శ్రీ పథకంతో పాఠశాలలో 3 నెలలుగా విద్యార్థినిలకు కొనసాగిన మార్షల్ ఆర్ట్స్ సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమం ఇటీవల ముగిసింది. ఈ మేరకు గురువారం టీఎస్ డబ్ల్యూఆర్ఈఎస్ అందోల్‌లో విద్యార్థినిలకు వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ పోచయ్య ఆధ్వర్యంలో బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థినిలు పాల్గొనగా 250 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వారికి బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్లు శ్రీకాంత్, శ్రీనివాస్, మల్లేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, పీఈటీలు మౌనిక, అంకిత, మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృత్తిక నక్షత్ర వేడుకలు

సంగారెడ్డి టౌన్ : పట్టణ శివారులోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో కృత్తిక నక్షత్ర వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించి లలిత సహస్ర పారాయణం చదివారు. అనంతరం అమ్మవారి పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ అనంత కృష్ణ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హస్తం.. ఆచితూచి!

- ఇప్పటికే లోక్‌సభ స్థానాన్ని చుట్టేసిన బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు
- ముఖ్య కార్యకర్తల సమావేశాలు, చేరికలపైనా రెండు పార్టీల నజర్
- కాంగ్రెస్‌లో కనిపించని దూకుడు
- జహీరాబాద్‌లో ముఖ్యనేతలతో షెట్కార్ భేటీ



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జహీరాబాద్ లోక్‌సభ స్థానం ఎన్నికల కార్యాచరణ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఆచితూచి వ్యవహరిస్తోంది. ఒకవైపు బీఆర్ఎస్, బీజేపీలు ఇప్పటికే నియోజకవర్గం మొత్తాన్ని చుట్టేసి వచ్చాయి. ఆ పార్టీల నేతలు అన్ని అసెంబ్లీ స్థానాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలు, పార్టీలో చేరికలు ఇలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో కూడా రెండు పార్టీల సమావేశాలు జరిగాయి. కానీ కాంగ్రెస్ విషయానికి వస్తే మాత్రం ఇప్పటి వరకు ఒక్క నారాయణఖేడ్ నియోజకవర్గం మినహా మిగిలిన రెండు అసెంబ్లీ స్థానాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలే నిర్వహించలేదు. ఈ లోక్‌సభ స్థానం ఇన్‌చార్జిగా నియమితులైన మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లో తన నివాసంలో ముఖ్య నేతలతో సమీక్ష నిర్వహించారు. అలాగే సీఎం రేవంత్‌రెడ్డి కూడా హైదరాబాద్‌లో ఈ నియోజకవర్గంపై సమీక్ష చేశారు. ఈ సమీక్షలు జరిగి దాదాపు వారం రోజులు దగ్గరపడుతున్నప్పటికీ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టలేదు. వాస్తవానికి అన్ని పార్టీల కంటే ముందే కాంగ్రెస్ అధినాయకత్వం ఈ నియోజకవర్గ అభ్యర్థిని ప్రకటించింది. తొలి జాబితాలోనే సురేష్‌షెట్కార్‌కు టికెట్ ఖరారు చేసింది. షెట్కార్ అభ్యర్థిత్వం ఖరారై దాదాపు 20 రోజులు గడుస్తోంది. ఆ తర్వాతే బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ఖరారయ్యారు. కానీ ఎన్నికల కార్యాచరణ విషయానికి వస్తే మాత్రం ఈ పార్టీలు దూకుడుగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే పోలింగ్‌కు సుమారు నెల రోజులు సమయం ఉంది. ఇప్పటి నుంచే కార్యక్రమాలు నిర్వహిస్తే ఖర్చు తడిసి మోపెడవుతుందనే కారణంగానే కాంగ్రెస్ ఆచితూచి వ్యవహరిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటు బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు గాలి అనిల్‌కుమార్, బీబీపాటిల్‌లు మాత్రం ప్రతీరోజు ఏదో ఒక కార్యక్రమం పేరుతో నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. కానీ కాంగ్రెస్ విషయానికి వస్తే మాత్రం ఆ దూకుడు కనిపించడం లేదు.

జహీరాబాద్ నేతలతో చర్చ..

కాంగ్రెస్ ముఖ్యనేతల సమావేశం ఎట్టకేలకు గురువారం సాయంత్రం జహీరాబాద్‌లో జరిగింది. జహీరాబాద్ అసెంబ్లీ స్థానం పరిధిలోని అతి కొద్దిమంది కీలక నేతలతో షెట్కార్ భేటీ అయ్యారు. ఈ ఎన్నికల్లో ఎలా ముందుకెళ్లాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ నాలుగింటిని హస్తం గతం చేసుకున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ రెండు చోట్ల, బీజేపీ ఒక చోట విజయం సాధించాయి. అయితే లోక్‌సభ ఎన్నికల విషయానికి వస్తే మాత్రం కాంగ్రెస్ దూకుడు బయటకు కనిపించడం లేదు. ఒకటీ రెండు రోజుల్లో జిల్లాలోని అన్ని చోట్ల ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించే యోచనలో కాంగ్రెస్ పార్టీ ఉంది.

నీటి సరఫరా పునరుద్ధరణ



జీర్గి తండాలో నల్లా వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

సాక్షి ఎఫెక్ట్

కంగ్టి(నారాయణఖేడ్): తాగు నీటి సమస్యపై 'తండాల్లో తండ్లాట' శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. తండాలో ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీరు సరఫరా అయ్యే మోటారుకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించినట్లు జీర్గితండా పంచాయతీ సెక్రటరీ మహ్మద్ అజీమొద్దీన్ తెలిపారు. గురువారం నీరు సరఫరా కావడంతో తండావాసులు సంతోషం వ్యక్తం చేశారు.

రఘునందన్‌పై ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: ఓట్ల కోసం దేవుడిని అడ్డుపెట్టుకోవడం సిగ్గుచేటని మెదక్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. మోదీ ఫొటోలున్న శ్రీరాముడి క్యాలెండర్లను ఓటర్లకు పంచి పెడుతూ ఎన్నికల నిబంధనను ఉల్లంఘించిన బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు పై జిల్లా ఎన్నికల కమిషన్‌కు గురువారం ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. మత రాజకీయాలు చేస్తూ హిందువుల ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల సెంటిమెంటు ఆసరాగా చేసుకుని రాముడి ఫొటో ఉన్న క్యాలెండర్లు పంచిపెడుతూ ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని అన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

నారాయణఖేడ్: పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఖేడ్ డివిజన్ నాయకుడు చిరంజీవి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో కార్మికులతో సమావేశమై మాట్లాడారు. కార్మికులకు జీఓ ప్రకారం వేతనాలు అందించాలని, కాస్మొటిక్స్, సబ్బు, సర్ఫ్, నూనె, బెల్లం, బూట్లు, ఇతర వస్తువులు అందించాలని కోరారు. అలాగే ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో కార్మి కులు వాజిద్, సురేశ్, విఠల్, కాంతమ్మ, చిన్నమ్మ, నాగమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార రథాలు ప్రారంభించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

బీఆర్‌ఎస్‌తోనే పేదల సంక్షేమం

సంగారెడ్డి : బీఆర్ఎస్‌తోనే పేదల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీలకు సంబంధించిన ప్రచార రథాలను గురువారం పోతిరెడ్డిపల్లిలోని శివాలయం వద్ద ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కావాలంటే మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరారు. పీవీఆర్ ట్రస్టు ద్వారా లోక్‌సభ నియోజకవర్గాల్లో పేద విద్యార్థులకు ఉచితంగా విద్య అందించాలన్న వెంకట్రాంరెడ్డి ఆలోచన గొప్పదన్నారు. పేదలకు భారం కావద్దని నియోజకవర్గంలో ఒక్క రూపాయికే ఫంక్షన్ హాల్ అందుబాటులోకి తెస్తామని చెప్పడం అభినందనీయమన్నారు. పట్నం మాణిక్యం, కాసాల బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి, మామిళ్ల రాజేందర్, విజేందర్ రెడ్డి, విఠల్, నక్క నాగరాజ్ గౌడ్, నర్సింలు, విష్ణు, విఠల్, చీల మల్లన్న, శ్రావణ్ రెడ్డి పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డి విజయం ఖాయం

హత్నూర(సంగారెడ్డి): కేసీఆర్ పాలనలో చేసిన అభివృద్ధి తోనే లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయం సాధించడం ఖాయమని రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మంగాపూర్ గ్రామంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారం చేపట్టి మూడు నెలలు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ రాగానే రైతులకు కష్టాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించే పార్టీ సమావేశానికి పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు, నాయకులు నరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, రమేష్, సుధాకర్, రాజు, ఆగమయ్య, అర్జున్, రాములు పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు

నారాయణఖేడ్: ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లో మత్తడిపోచమ్మ, దుర్గాభవానీ అమ్మవార్ల వార్షిక జాతర ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం కుస్తీ పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. నువ్వా.. నేనా అన్నట్లు ఉత్కంఠంగా జరిగాయి. ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుంచి మల్లయోధులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కుస్తీలను వీక్షించేందుకు జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఫైనల్లో గెలుపొందిన వారికి తులం వెండి కడియం బహూకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు.



కుస్తీ పడుతున్న పైల్వాన్లు

శివయోగి మహాస్వామి జన్మదిన వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న స్వాములు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని తంగడపల్లి గ్రామ శివారులో గల కోటి బిల్వ లింగేశ్వర మఠం, గురు గంగాధర మహాస్వామి ఆశ్రమ పీఠాధితులు శివయోగి శివాచార్య మహాస్వామి 29వ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సుగంధ లేపనములతో మంగళ స్నానము, పాదపూజ, లక్ష పుష్ప బిల్వార్చన, రకరకాల ఫలములచే తులాభార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొట్టూరేశ్వర మహాస్వామి, బక్కయ్య స్వామి, అల్వూరి విశ్వనాథం, మడివాలయ స్వామి, జంగం మహేష్ స్వామి, ఈశ్వరయ్య స్వామి, విజయ స్వామి పాల్గొన్నారు.

తెరపైకి అలైన్‌మెంట్ మార్పు!

- ట్రిపుల్‌ఆర్ వ్యవహారంలో కీలక పరిణామం
- మరోసారి పరిశీలనకు సర్కార్?
- కోమటిరెడ్డిని కలిసిన భూ బాధితులు
- గత ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించిందంటూ ఆరోపణ

గజ్వేల్: రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగంలో ఈ రోడ్డు నిడివి 158 కిలోమీటర్లు. ఇందులో 100 కిలోమీటర్లకుపైగా ఉమ్మడి మెదక్ జిల్లాలో విస్తరించనుంది. భూసేకరణను సులభతరం చేయడానికి రెవెన్యూ డివిజన్ల వారీగా కాలా(కాంపీటెంట్ అథారిటీ ఫర్ ల్యాండ్ అక్విజిషన్)లను ఏర్పాటు చేశారు. అందోల్–జోగిపేట కాలా పరిధిలో 8.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపడుతుండగా, ఐదు గ్రామాల్లో భూసేకరణ జరగనుంది. గజ్వేల్ పరిధిలో 32 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి 17గ్రామాల్లో, తూప్రాన్ పరిధిలో 14కిలోమీటర్ల రోడ్డు కోసం 8గ్రామాల్లో, నర్సాపూర్‌లో 28కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి 14గ్రామాల్లో భూసేకరణ చేపడుతున్నారు. సంగారెడ్డి పరిధిలోనూ పది గ్రామాల వరకు భూసేరణ జరగనుంది. మొత్తంగా అయిదు కాలాల పరిధిలోని 54కిపైగా గ్రామాల్లో 4,500 ఎకరాల వరకు భూసేకరణ చేయనున్నారు. అత్యధికంగా గజ్వేల్‌లో 980 ఎకరాలను సేకరించనున్నారు. ఇవీ కాకుండా ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో చౌటుప్పల్, యాదాద్రితోపాటు భువనగిరికి ప్రత్యేకంగా కాలాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రస్తుతం ట్రిపుల్‌ఆర్ భూసేకరణ ప్రక్రియను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో అలైన్‌మెంట్ మార్పు వ్యవహారం తెరపైకి వచ్చింది.

మొత్తం 980 ఎకరాలు

గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 32కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఇందుకు జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి, ఇటిక్యాల, అలిరాజపేట, మర్కూక్ మండలం అంగడికిష్టాపూర్, చేబర్తి, ఎర్రవల్లి, పాములపర్తి, గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్, ముట్రాజ్‌పల్లి, సంగాపూర్, మక్తమాసాన్‌పల్లి, బంగ్లావెంకటాపూర్, వర్గల్ మండలం మైలారం, జబ్బాపూర్, నెంటూర్, రాయపోల్ మండలం బేగంపేట, ఎల్కల్ గ్రామాల్లో మొత్తంగా 980 ఎకరాల భూసేకరణ జరగనుంది. ఉత్తర భాగం పరిధిలో అత్యధికంగా ఇక్కడే జరగనుంది. అధికారులు ఆయా గ్రామాల్లోని రైతులకు నోటీసులు ఇచ్చి... గజ్వేల్ ఆర్‌డీఓ కార్యాలయంలో వారితో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు.

రైతుల ఆందోళన బాట

ఈ క్రమంలోనే గత నెల 20న మర్కూక్ మండలం చేబర్తి రెవెన్యూ పరిధిలోని చేబర్తి, నర్సన్నపేట గ్రామాలకు చెందిన రైతులను పిలిపించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భూబాధితులు పాత అలైన్‌మెంట్ మార్చి.. తమ గ్రామాల్లోంచి ట్రిపుల్‌ఆర్ వెళ్లేలా చేశారని, గత ప్రభుత్వంలో ఈ కుట్ర జరిగిందని ఆరోపించారు. అంతేకాకుండా హైదరాబాద్ ఔటర్ నుంచి ట్రిపుల్‌ఆర్ రేడియస్‌ను 60కిలోమీటర్లు ఉంచాల్సి ఉండగా, కేవలం 30కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామాలను చేర్చారని ఆరోపిస్తూ ఆందోళన బాటపట్టారు. ఇదే క్రమంలో తాజాగా మంగళవారం ఉగాది సందర్భంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో భూబాధితులు నగరంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి అలైన్‌మెంట్ మార్పు అంశాన్ని దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఈ వ్యవహారంపై అధికారులతో కలిసి పరిశీలన జరిపి, న్యాయం చేస్తామని చెప్పారు. దీంతో అలైన్‌మెంట్ అంశంపై భూబాధితులకు ఆశలు చిగురించాయి.



నిబంధనలు పాటించలేదు

గజ్వేల్ నియోజకవర్గంలో ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌కు సంబంధించి నిబంధనలు పాటించలేదు. హైదరాబాద్ ఔటర్‌కు 30కిలోమీటర్లలోపే ఎలా మార్గం ఖరారు చేస్తారు?. ఫామ్ హౌస్ నుంచి ట్రిపుల్‌ఆర్ వెళ్లేలా గత ప్రభుత్వంలో కుట్ర చేసినట్లు తెలుస్తుంది. ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా.

– తూంకుంట నర్సారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత!

- అక్రమంగా మట్టి దందా
- సర్కార్ భూములే టార్గెట్
- రాత్రి సమయంలో తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): సర్కార్ భూములే టార్గెట్‌గా కొందరు అక్రమార్కులు మట్టి దందా నిర్వహిస్తున్నారు. కంకర క్రషర్‌లకు కేటాయించిన ప్రభుత్వ భూముల నుంచి రాత్రివేళ జేసీబీలతో గుట్టుచప్పుడు కాకుండా మట్టిని తోడేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే ఈ మట్టి వ్యాపారం నడుస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

జిన్నారం మండలంలోని రాళ్లకత్వ గ్రామ పరిధిలోని కంకర క్రషర్‌లకు కేటాయించిన 286 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూముల నుంచి కొంత మంది అక్రమార్కులు మట్టిని తోడేస్తున్నారు. అంతేకాకుండా మరిన్ని ప్రైవేటు భూముల నుంచి కూడా మట్టిని తవ్వి భారీ టిప్పర్ వాహనాల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. పది రోజుల నుంచి నిత్యం 200 టిప్పర్‌ల ద్వారా మట్టిని తరలిస్తున్నారంటే ఇక్కడ వ్యాపారం ఏ మేరకు జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. శివానగర్‌లోని ఎల్ఈడీ పార్కులోని పలు పరిశ్రమలకు ఈ మట్టిని తరలిస్తున్నారు. గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించకుండా కేవలం కొంతమంది వ్యక్తులు ఈ మట్టిని గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో మట్టిని తరలిస్తున్న విషయాన్ని స్థానిక ప్రజలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని చెబుతున్నారు. గ్రామంలోని పలువురు నాయకులు, అధికారుల కను సన్నల్లోనే ఈ అక్రమ వ్యాపారం నడుస్తుందని విమర్శలు వస్తున్నాయి. అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఈ విషయమై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



మట్టిని తవ్వడంతో ఏర్పడిన భారీ గుంత

ఇప్పటికే హెచ్చరించాం

మట్టిని తరలిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. అధికారులను పంపి హెచ్చరించాం. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే సహించేది లేదు. రాత్రి సమయంలో మొబైల్ టీంలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నాం.

– భిక్షపతి, తహసీల్దార్, జిన్నారం

క్లుప్తంగా

కుట్రలను తిప్పి కొట్టాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



ప్రచారోద్యమాన్ని ప్రారంభిస్తున్న శంకర్

గజ్వేల్ : రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను తిప్పి కొట్టాల్సిన అవసరముందని డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పీ.శంకర్ పిలుపునిచ్చారు. మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గురువారం గజ్వేల్‌లోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీబీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచారోద్యమాన్ని శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 400 ఎంపీ సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామంటూ బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు ప్రకటించడం వెనుక కుట్రలను అర్థం చేసుకోవాలన్నారు. దళిత ఉద్యోగుల ఐక్య వేదిక నాయకులు పీ.ఎల్లయ్య, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, ప్రజా కళాకారులు జాలిగామ బాల్‌నర్సయ్య, ఎర్ర మల్లేశం, డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణు పాల్గొన్నారు.

రూ.లక్ష పట్టివేత



నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలం కోళాపల్లి 161వ జాతీయ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఎలాంటి అనుమతి లేకుండా రూ. లక్ష తీసుకెళ్తున్న నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ.శంకర్ గురువారం తెలిపారు. మహారాష్ట్ర డెగ్‌లూర్‌కు చెందిన రాజుశేఖర్‌రావు వాహనంలో అనుమతి లేకుండా హైదరాబాద్ వైపు వెళ్తుండగా నగదు స్వాధీనం చేసుకొని సంగారెడ్డి డిస్ట్రిక్ గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్

సిద్దిపేటకమాన్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సిద్దిపేట పట్టణంతోపాటు జిల్లా వ్యాప్తంగా కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు గురువారం విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ రంగదాంపల్లి చౌరస్తాలో, వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు, టూటౌన్ సీఐ ఉపేందర్‌లు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ అనురాధ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరైనా రూ.50వేల కంటే ఎక్కువ డబ్బులు వెంట తీసుకెళ్లొద్దన్నారు.

11 ఏళ్లుగా పరారీలోనే..

- ఎట్టకేలకు నిందితుడు అరెస్ట్
- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

వట్‌పల్లి(అందోల్): హత్యానేరం కింద కేసులో నిందితుడిగా 11 ఏళ్ల పరారీలో ఉన్న ఓ వ్యక్తిని గురువారం వట్‌పల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నాగులపల్లి గ్రామానికి చెందిన పంచలింగాల చంద్రయ్యని 2013లో ముగ్గురు వ్యక్తులు హత్య చేయగా అప్పట్లో అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ హత్యలో రెండవ నిందితుడైన మొటిక సిద్ధయ్య పరారీలో ఉండగా, బుధవారం నమ్మదగిన సమాచారం మేరకు నిందితుడిని పట్టుకొని న్యాయస్థానం ఎదుట హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు. 11 ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందుతుడిని పట్టుకోవడంపై వట్‌పల్లి ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ నర్సింగ్‌రావు, పోలీస్ సిబ్బందిని జోగిపేట సీఐ అనిల్‌కుమార్ అభినందించారు.

ఇక స్మార్ట్ గురూ..

ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక యాప్‌లు



- ఫిర్యాదులు వేగంగా పరిష్కారం
- దివ్యాంగులకు వరంలా సరికొత్త ఫీచర్లు
- పోలింగ్ బూత్‌ల సమాచారం సులువు
- ఓటర్లు వినియోగించుకోవాలంటున్న అధికారులు

మెదక్ కలెక్టరేట్: ఈసారి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘ్య ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో పౌరుల భాగస్వామ్యం పెంచేందుకు వివిధ రకాల మొబైల్ యాప్‌లను ప్రవేశ పెట్టింది. సువిధ, సీ-విజిల్, కేవైసీ, అబ్జర్వర్, సాక్షం, ఓటరు హెల్ప్ వంటి యాప్‌లతోపాటు నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎన్నికలకు సంబంధించిన సమాచారం, కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు, ఎన్నికల నియమావళి, ఓటర్లకు అవసరమైన సాయం, ఎన్నికల ఖర్చు, పోలింగ్‌బూత్‌ల వివరాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల సమాచారం తెలుసుకునేందుకు ఈ యాప్‌లను ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టింది. ఎన్నికలకు సంబంధించిన అన్ని యాప్‌లు ప్రతీ ఆండ్రాయిడ్ మొబైల్‌లో ఉండే ప్లే స్టోర్‌లో లభ్యమవుతాయి. ఈ సమాచారం తెలుసుకోవాలనుకున్నా ప్లేస్టోర్ ఓపెన్ చేసి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

ఓటరు హెల్ప్‌లైన్



ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా వివరాలు, ఎలక్ట్రోరల్ రోల్‌లో ఓటరు పేరు సెర్చ్ చేయడం, ఓటు వేసేందుకు అర్హత ఉందో లేదో నిర్ధారించుకునేందుకు ఈయాప్‌ను ఉపయోగించవచ్చు. డిజిటల్ ఫొటో ఓటర్ స్లిప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎన్నికలకు సంబంధించిన వార్తల అప్‌డేట్ పొందవచ్చు.

సువిధ



ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు నామినేషన్ అనుమతి ప్రక్రియలో సహాయపడేందుకు అభివృద్ధి చేసిన అప్లికేషన్ సువిధ, ఈ యాప్‌లో అభ్యర్థులు రిజిస్టర్ చేసుకొని, వారి ఆధారాలతో లాగిన కావాలి. తరువాత వారి నామినేషన్ల అనుమతి చూడవచ్చు. సువిధ క్యాండిడెట్ యాప్ అభ్యర్థులకు అనేక ఇతర ఫీచర్లు అందిస్తుంది. ప్రచారానికి అవసరమైన అనుమతుల గురించి తెలుసుకోవచ్చు.

కేవైసీ



ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. క్రిమినల్ కేసులు, వాటి స్థితి, నేరాల స్వభావం వంటి వివరాలు ఉంటాయి. నేర చరిత్ర ఉన్న అభ్యర్థులను గుర్తించేందుకు, వారికి ఓటు వేయకుండా ఉండేందుకు ఈ యాప్ ఓటర్లకు సహాయపడుతుంది.

దివ్యాంగులకు సాక్షం



పోలింగ్ రోజున వీల్‌చైర్ కోరేందుకు, పోలింగ్ స్టేషన్ తెలుసుకునేందుకు దివ్యాంగులకు తోడ్పడేలా సాక్షం యాప్‌లో అనేక ఫీచర్ అందుబాటులో ఉంచారు. దృష్టి లోపం ఉన్న దివ్యాంగులకు వాయిస్ సహాయం అందిస్తుంది. టెక్స్ట్ టు స్పీచ్ సదుపాయం కూడా ఉంది.

సీ-విజిల్



ఎన్నికల ఉల్లంఘటనలపై సాక్ష్యాలతో సహా ఈ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయొచ్చు. ఆడియో, వీడియో, ఫొటో ఏదో ఒక రూపంలో రికార్డు చేసి యాప్‌లో ఫిర్యాదు చేస్తే అధికారులు నిమిషాల్లో స్పందిస్తారు. వంద నిమిషాల్లో అధికారులు తప్పనిసరిగా స్పందించి ఘటనపై తగు చర్యలు చేపడుతారు. పార్టీలకతీతంగా ఎవరు కోడ్ ఉల్లంఘించినా ఫిర్యాదులు చేయొచ్చు. డబ్బుల పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం వంటి ఉల్లంఘనలను ఫొటో, వీడియో, ఆడియో క్లిప్‌గా యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. యాప్ తెరవగానే ఫొటో, వీడియో, ఆడియో అనే ఆప్షన్లు ఉంటాయి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. అధికారులు తక్షణం స్పందించి అక్రమాలను అరికట్టేందుకు కృషి చేస్తారు.

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్(ఎన్‌జీఎస్‌పీ) ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఎన్నికల కమిషన్‌కు సహాయపడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఓటరు తన మొబైల్ నంబర్‌ను ఉపయోగించి పోర్టల్‌లో ప్రొఫైల్ నమోదు చేసుకోవచ్చు. అలాగే దీని ద్వారా ఎన్నికల సంఘానికి పలు సమస్యలపై ఫిర్యాదులు చేయొచ్చు. నిర్ణీత వ్యవధిలోగా ఎన్నికల అధికారి స్పందించి సమస్య పరిష్కారం చూపుతారు. పోలింగ్ బూత్ ఉన్నచోట, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఎన్నికల ఖర్చు, అక్రమాలు వంటి వాటికి సంబంధించిన ఫిర్యాదులను ఈ యాప్ ద్వారా సకాలంలో పరిష్కారం పొందవచ్చు. పౌరులు తమ ఫిర్యాదులు ఏ స్థాయిలో ఉన్నాయో కూడా ఈ యాప్‌లో పరిశీలించవచ్చు.

అబ్జర్వర్

ఎన్నికల కోడ్ దుర్వినియోగం, అక్రమాలకు సంబంధించిన కేసులను తెలుసుకునేందుకు వీలుగా అబ్జర్వర్లకు ఈ యాప్ ఉపయోగపడుతోంది. దీన్ని ఉపయోగించేందుకు ఎన్నికల పరిశీలకులు ముందుగా లాగిన్ క్రియేట్ చేసుకొని, వారి పాస్‌వర్డ్‌తో సమాచారం అందించాలి. అక్రమాలను అరికట్టేందుకు ఈ యాప్ చాలా ఉపయోగపడుతుంది. తమ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య, రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఉన్న ప్రదేశం వంటి సమాచారం పొందవచ్చు.

దివ్యాంగులపై వేధింపులు అరికట్టాలి

- ఎన్‌పీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

మెదక్ కలెక్టరేట్: దివ్యాంగులపై వేధింపులు అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక(ఎన్‌పీఆర్డీ) రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. గురువారం ఎన్‌పీఆర్డీ జిల్లా కమిటీ సమావేశం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు కె.యశోద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ... దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు అంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం దేశంలోని కార్మికుల హక్కులను నాశనం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. ఎన్‌పీఆర్డీ జిల్లా అధ్యక్షురాలు కె.యశోద మాట్లాడుతూ.. జూన్ 8,9 తేదీల్లో సీఐటీయూ జిల్లా 7వ మహాసభలు మెదక్ పట్టణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు యం.బస్వారాజు, జిల్లా ఉపాధ్యక్షుడు యం.గౌతమ్, గుమ్మడిదాల శ్రీనివాస్, ముత్యాలు, ఆగమయ్య, సహాయ కార్యదర్శులు చంద్రం, చెంద్రమ్మ, శ్రీనివాస్, భిక్షపతి, మహేందర్ రెడ్డి, జిల్లా నాయకులు కవిత, కిష్టయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడివయ్య

28 టన్నులు.. 18 క్వింటాళ్లు



తూప్రాన్: లారీలో తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు



కొండపాక(గజ్వేల్): బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

- తూప్రాన్‌లో భారీగా రేషన్ బియ్యం పట్టివేత
- సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగింత
- లారీ, ఆటో సీజ్, కేసు నమోదు

తూప్రాన్: అక్రమంగా వాహనాల్లో భారీ ఎత్తున తరలిస్తున్న రేషన్ బియాన్ని పోలీసులు పట్టుకోవడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. లారీ, ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సందర్భంలో హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు లారీలో సుమారు 28 టన్నుల రేషన్ బియాన్ని తరలిస్తుండగా గుర్తించాం. వెంటనే బియ్యాన్ని సీజ్ చేసి, లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించాం. కాసేపటికే మనోహరాబాద్ నుంచి నర్సాపూర్‌కు ఆటోలో తరలిస్తున్న 18 క్వింటాళ్ల బియాన్ని పట్టుకున్నాం. ఈ విషయాన్ని అధికారిణి ప్రణీత్‌రెడ్డికి సమాచారం అందించడంతో వారు లారీ, ఆటోలోని బియాన్ని పరిశీలించి ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వారం రోజుల వ్యవధిలోనే భారీ ఎత్తున రేషన్ బియ్యం పట్టుబడింది. పేదలకు అందాల్సిన బియ్యం పక్కదారి పట్టడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేసి అక్రమ రవాణను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా ఇంట్లో నిల్వ..

కొండపాక(గజ్వేల్): ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ పట్టుకున్నట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రమైన కొండపాకలో తిరుపతి, సాయి కృష్ణ అక్రమంగా రేషన్ బియ్యాన్ని ఇంట్లో నిల్వ చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు గురువారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, కుకునూరుపల్లి పోలీసులు సంయుక్తంగా రైడ్ చేసి రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

యువకుడు అదృశ్యం



ఫయాజ్

తూప్రాన్: యువకుడు అదృశ్యమైన ఘటన తూప్రాన్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న మహ్మద్ ఫయాజ్(37)ను కుటుంబ వ్యాపార విషయంలో తండ్రి మందలించడంతో ఇంటి నుంచి 10వ తేదీన వెళ్లాడు. రెండు రోజులైనా ఇంటికి రాకపోగా ఫోన్ స్విచ్చాఫ్ చేసి ఉంది. స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు.

జాబ్‌కు వెళ్లిన యువతి..



ఘురమణి (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): యువతి అదృశ్యమైన ఘటన గుమ్మడిదల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం మేరకు.. ఒడిషా రాష్ట్రానికి చెందిన జలంగీర్ జిల్లా నుంచి మూడ గ్రామానికి చెందిన బయరామ్ బిబ్‌హార్ కుటుంబ సభ్యులతో కలిసి గుమ్మడిదల గ్రామంలో నివాసం ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. జయరామ్ కుమార్తె ఘురమణి అన్నారంలోని ఓ ప్రైవేటు కంపెనీలో విధులు నిర్వహిస్తోంది. ఈనెల 10వ తేదీన ఎప్పటిలాగే కంపెనీకి వెళ్లిన ఘురమణి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ చేసినా కలవడం లేదు. సమీపంలోని బంధువులు, స్నేహితుల వద్ద సమాచారం కోసం ఆరా తీసినా ఆచూకీ తెలియలేదు. గురువారం యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

వాచ్‌మెన్లను కట్టేసి తవ్వకాలు

- ఫామ్ హౌస్‌లోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు
- శివ్వంపేట మండలంలో ఘటన



ఫామ్‌హౌస్‌లోని ఓ గదిలో తవ్వకాలు

శివ్వంపేట(నర్సాపూర్) : ఓ ఫామ్‌హౌస్‌లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి గదిలో తవ్వకాలు జరిపిన ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధి పిల్లుట్ల గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శైలేందర్ పిల్లుట్ల గ్రామ శివారులో రెండు ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసి అందులో ఫామ్ హౌస్ నిర్మించాడు. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఫామ్‌హౌస్‌లోకి చొరబడ్డారు. అక్కడ వాచ్‌మెన్లుగా పని చేస్తున్న దాసరి కృష్టయ్య, ఎర్రోళ్ల కృష్ణయ్యను తాళ్లతో కట్టేసి వారి వద్ద ఉన్న ఫామ్‌హౌస్ గది తాళాలు తీసుకొని లోనికి వెళ్లారు. పలు వస్తువులు చిందర వందరగా పడేసి ఓ గదిలో తవ్వకాలు జరిపారు. అనంతరం ఫామ్ హౌస్‌లోని సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్ వెంట తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ కృష్ణ, ఎస్ఐ మహిపాల్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఫామ్‌హౌస్‌లో ఎలాంటి చోరీ జరగలేదని, ఎందుకు వచ్చారు.. ఎందుకు తవ్వారు అనే దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో గీత కార్మికుడి ఆత్మహత్య



జగదీశ్ (ఫైల్)

నంగునూరు(సిద్దిపేట): అప్పుల బాధతో గీత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ముండ్రాయి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ముండ్రాయికి చెందిన సాదుపల్లి సత్తయ్య పదేళ్ల కిందట చనిపోవడంతో అతడి కుమారుడు సాదుపల్లి జగదీశ్ (30) గీత కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబం గడవడానికి అప్పులు పెరగడంతో తీర్చేమార్గం లేక బుధవారం ఇంటి వద్ద గడ్డి మందు తాగి వాంతులు చేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు జగదీశ్‌ను ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి చెందాడు. తల్లి పుష్పలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రాజగోపాల్‌పేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం



మద్యాన్ని చూపుతున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: అక్రమ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కరీంనగర్ రోడ్డు హనుమాన్ నగర్‌లో దండుగుల స్వప్న ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తుంది. టూ టౌన్ పోలీసులు గురువారం రైడ్ చేసి 4.220 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పొదల్లోకి దూసుకెళ్లిన బైక్

ఆర్ఎంపీ డాక్టర్ మృతి



శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఆర్ఎంపీ వైద్యుడు మృతి చెందినట్లు ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం కుందారం గ్రామానికి చెందిన బండారి శ్రీధర్‌రెడ్డి (50) 25 ఏళ్లుగా కౌడిపల్లి మండలం భుజిరంపేటలో ఉంటూ ఆర్ఎంపీగా పని చేస్తున్నారు. బుధవారం రాత్రి శ్రీధర్‌రెడ్డి బైక్‌పై దుంపలకుంట వెళ్లి తిరిగి వస్తున్నారు. గిర్నిలకుంట ఎల్లమ్మగుడి సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన పొదల్లోకి దూసుకెళ్లింది. పక్కనే ఓ పొలం వద్ద పని చేస్తున్న రైతులు శ్రీధర్‌రెడ్డిని బయటకు 108 వైద్యులు వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి అన్న బండారి శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లిఫ్ట్ అడిగి.. అంతలోనే మృత్యుఒడిలోకి

- కంటైనర్‌ను ఢీకొట్టిన కారు
- వలస కూలీ మృతి, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- తూప్రాన్ మండలంలో ఘటన



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



సురేశ్ మృతదేహం

తూప్రాన్: సొంత గ్రామానికి వెళ్లేందుకు లిఫ్ట్ అడిగి కారెక్కిన వలస కూలీ అనూహ్యంగా రోడ్డు ప్రమాదంలో అసువులుబాశాడు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున మెదక్ జిల్లా తూప్రాన్ టోల్‌ప్లాజా సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని దేగ్లూర్ మండలం హవర్గా గ్రామానికి చెందిన బర్‌సంవార్ సురేశ్(45), భార్య అయిలాబాయితో కలిసి నాలుగేళ్ల కిందట మేడ్చల్ జిల్లా సుచిత్రాలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో సొంత గ్రామానికి వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయలుదేరిన సురేశ్ గురువారం తెల్లవారుజామున సుచిత్రా వద్ద కారును లిఫ్ట్ అడిగి ఎక్కాడు. కారు తూప్రాన్ పట్టణ సమీపంలోని టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగానే రహదారి పక్కన నిలిపి ఉన్న కంటైనర్‌ను అతివేగంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగంలో కూర్చున్న సురేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కామారెడ్డి జిల్లా పోషన్‌పేట్ కారు డ్రైవర్ షాదులా అనీల్ కుమార్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు.

వైద్యం.. సుదూరం

- కార్మికులకు అందనంత దూరాన ఈఎస్ఐ సేవలు
- ఏళ్లుగా నుంచి వైద్యం కోసం తిప్పలు
- బొల్లారానికి చెందిన ఈఎస్ఐ ఇతర జిల్లాలో ఏర్పాటు



బాచుపల్లిలో ఉన్న ఈఎస్ఐ

జిన్నారం(పటాన్‌చెరు): ఈఎస్ఐ సేవలు కార్మికులకు దూరమవుతున్నాయి. ఏళ్ల కాలం నుంచి ఈ సేవలు లేకపోవటంతో కార్మికులు ప్రైవేటు వైద్యం వైపు చూస్తున్నారు. పారిశ్రామిక వాడలో కాకుండా పది కిలోమీటర్ల దూరంలో ఇతర ప్రాంతంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఉండటం పెద్ద సమస్యగా మారింది. నిరుపేద కార్మికులకు అందాల్సిన సేవలు అందడం లేదు. తక్షణమే పారిశ్రామిక వాడలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని కార్మికులు కోరుతున్నారు.

జిన్నారం మండలంలోని గడ్డపోతారం, ఖాజీపల్లి, బొల్లారం పారిశ్రామిక వాడల్లో సుమారు 150 పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో రెండు లక్షల వరకు ఆయా రాష్ట్రాలకు చెందిన కార్మికులు విధులు నిర్వహిస్తుంటారు. వీరిలో 70 వేల మంది కార్మికులకు ఈఎస్ఐ కార్డులు ఉన్నాయి. గతంలో ఈఎస్ఐ (ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్) డిస్పెన్సరీ బొల్లారం పారిశ్రామిక వాడలో ఉండేది. పదేళ్ల క్రితం ఈఎస్ఐ డిస్పెన్సరీని సుమారు పది కిలో మీటర్ల దూరంలోని రంగారెడ్డి జిల్లా పరిధిలో గల బాచుపల్లికి తరలించారు. తరలించేందుకు గల కారణాలను కూడా అధికారులు వెల్లడించలేదు. అప్పటి నుంచి కార్మికులు వైద్యం చేయించుకునేందుకు పది కిలోమీటర్ల దూరంలోని ఈఎస్ఐకి వెళ్లాల్సి వస్తుంది. కష్టపడి పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఖర్చులు కార్మికులకు భారంగా మారుతున్నాయి. ఈఎస్ఐని బాచుపల్లి నుంచి బొల్లారానికి మార్చాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. కార్మికుల అవసరాలను అదునుగా చేసుకొని ప్రైవేటు వైద్యులు దోచుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈఎస్ఐ ఆస్పత్రిని బొల్లారానికి మార్చాలని కార్మికులు కోరుతున్నారు.

అధికారులపై ఒత్తిడి తెస్తున్నాం



కార్మికులకు ఈఎస్ఐ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ విషయమై అధికారులపై ఒత్తిడి తెస్తున్నాం. కార్మికులు ఏకంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలి. కార్మికులకు ఈఎస్ఐ వైద్య సేవలను అందించేందుకు తమవంతు కృషి చేస్తున్నాం.

– వరప్రసాద్‌రెడ్డి, కార్మిక నేత